17వ వసంతంలోకి
# చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల
మంగళవారం మే 19 2026 పేజీలు 8

## బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు

◆జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 18 : బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటూన్నామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 13 మంది ఆర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి -2లో

## ధాన్యం కొనుగోలులో బాధ్యత మరిచిన కేంద్ర ప్రభుత్వం

◆మిల్లర్ల వద్ద నుండి మూడు పంటల బియ్యం ఎఫ్ సీఐ ఎందుకు తీసుకోలేదో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి

◆ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు

◆రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



చురకలు ప్రతినిధి, ధర్మారం, మే 18 : ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం బాధ్యత మరిచిందని తప్పు కేంద్రం వద్ద పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపుతున్నారని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామంలో ధాన్యం కేంద్రాన్ని మంత్రి సోమవారం సందర్శించారు.ఈ సందర్భంగా కొనుగోలు జరుగుతున్న తీరును, రైతులకు డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అవుతున్న పరిస్థితిని రైతులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతియేటా మద్దతు ధర ప్రకటించి కొనుగోలు విషయాన్ని పట్టించుకోవడంలేదని మంత్రి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో గడచిన మూడు పంటల ధాన్యాన్ని రైతుల వద్ద సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్ల వద్ద నిల్వ చేసిందని మంత్రి వివరించారు. ఎఫ్ సి ఐ ద్వారా బియ్యం సేకరణ చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం బాధ్యత మరిచి బియ్యం సేకరించక పోవడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రైస్ మిల్లులో పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలు పేరుకు పోయాయని మంత్రి తెలిపారు.రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలోని పరిస్థితిని వివరించి ఎఫ్ సి ఐ ద్వారా బియ్యం సేకరణ చేయించాల్సిన విషయం మరిచి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. దేశ ప్రధాని ఇటీవల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన సందర్భంగా రాష్ట్ర రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక మాట మాట్లాడలేదని మంత్రి ఆరోపించారు. బాధ్యతగా రైతుల వద్ద నుండి రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సేకరిస్తుండగా బాధ్యత లేని బిజెపి నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.రైతులెవరు ఆందోళన పడవద్దని రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యతను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి తెలిపారు.కొనుగోలు పూర్తయిన తర్వాత మిల్లర్ల నుండి వచ్చే సమస్యలకు రైతులను బాధ్యులను చేయకుండా అధికారులు బాధ్యత తీసుకొని ఎలాంటి కోతలు విధించకుండా ధాన్యం దించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు.మిల్లర్లు దాన్యం ఏ బి గ్రేడ్ విషయంలో రైతులను ఇబ్బందులు పెట్టవద్దని ఇబ్బందులు పెడితే రైస్ మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

**రోడ్డు పనులు పరిశీలించిన మంత్రి అడ్లూరి**

ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామం నుండి పెగడపల్లి మండలం కీచులాటపల్లి -2లో

తూకం చేసిన ధాన్యాన్ని వెంటనే

## రైస్ మిల్లులకు తరలించాలి

◆జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



చురకలు విలేకరి,బీర్‌పూర్, మే 18 : తూకం చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ వేగవంతం చేయాలనే ఉద్దేశ్యంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సోమవారం బీర్ పూర్ మండలం చర్లపల్లి, నరసింహుల పల్లి, కందెన కుంట మరియు తుంగూర్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత -2లో

## క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి చేస్తా

◆జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్




చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 18 : జగిత్యాల నియోజకవర్గంలో క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే మారథాన్‌ను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్‌తో కలిసి ఘనంగా ప్రారంభించారు.జగిత్యాల పట్టణంలోని స్వామి వివేకానంద స్టేడియం నుండి ప్రారంభమైన ఈ మారథాన్‌లో యువత, విద్యార్థులు, క్రీడాకారులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ యువతలో ఆరోగ్య చైతన్యం, క్రమశిక్షణ ,క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి రోజు యోగ సాధన ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుంది. ఆరోగ్యమే మహాభాగ్యమని ,ప్రతి మనిషి జీవితంలో -2లో

ఆరోగ్యం.. ఫిట్నెస్ పై

## అవగాహన కల్పించేందుకు 2కే రన్

◆జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

◆ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా యువజన క్రీడా వారోత్సవాల కింద రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో 2కే రన్

◆హాజరైన ఎస్పీ మహేష్ బి గితే




చురకలు ప్రతినిధి సిరిసిల్ల, మే 18 : విద్యార్థులు, యువతలో ఆరోగ్యం.. ఫిట్నెస్ పై అవగాహన కల్పించేందుకు ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా యువజన క్రీడా వారోత్సవాల్లో 2కే రన్ నిర్వహించామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల -2లో

## ఈఏప్ సెట్ 2026 ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 18 :** ఈఏప్ సెట్ - 2026 ఇంజనీరింగ్, అగ్రికల్చర్ మరియు ఫార్మసి ఫలితాలలో జగిత్యాల అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి, ఉత్తమ ర్యాంకులు సాధించారు. పి.చరణ్ (ఇంజనీరింగ్ విభాగంలో) 22 వ ర్యాంకుతో మొదటి స్థానంలో, లాస్యరెడ్డి 614, రాజరపు లహరిక 2792, మహానాజ్ 8460 ర్యాంకులతో ప్రతిభ కనబర్చారు. నలుగురు విద్యార్థులు 1,000 లోపు ర్యాంకు సాధించారు. ఈఏప్ సెట్ - 2026 ఫలితాలలో ర్యాంకులు సాదించిన అల్ఫోర్స్ చిన్నారులన వారి తల్లిదండ్రులను, ఈ విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి అభినందించారు.

## తూకం చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి

**మొదటి పేజీ తరువాయి...** అధికారులకు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్ఫాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని ప్యాడీని ప్రొటెక్ట్ చేయాలన్నారు. ఈ పరిశీలనలో డిఎస్ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్ సుజాత, సంబంధిత అధికారులు, రెవెన్యూ సిబ్బంది, గిర్దావర్ రాహుల్ బీర్ పూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు అర్షకోట రాజ గోపాల్ రావు, నాయకులు దోసాలపు బుచ్చన్న, రైతులు, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు

**మొదటి పేజీ తరువాయి...** చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## ధాన్యం కొనుగోలులో బాధ్యత మరిచిన కేంద్ర ప్రభుత్వం

**మొదటి పేజీ తరువాయి...** వరకు 8 కిలోమీటర్ల దూరం నిర్మిస్తున్న నూతన రోడ్డు పనులను మంత్రి ఈ సందర్భంగా పరిశీలించారు. రూ. 11.21 కోట్లతో నిర్మిస్తున్న నూతన రోడ్డు ద్వారా ధర్మారం పెగడపల్లి మండలాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని మంత్రి తెలిపారు. నూతన రోడ్డుతో భూముల ధరలు సైతం పెరుగుతాయని మంత్రి అడ్లూరి తెలిపారు. రోడ్డు నిర్మాణానికి రైతులు సహకరించి సహకరించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ రైతులను కోరారు.

## క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి చేస్తా

**మొదటి పేజీ తరువాయి...**యోగ,వాకింగ్ వ్యాయామాన్ని భాగం చేసుకోవాలన్నారు. నేటి విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా ముఖ్యమంత్రి గ్రామీణ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు సీఎం కప్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, గ్రామీణ నైపుణ్యం గల క్రీడాకారులను వెలికి తీయడమే సీఎం కప్ ముఖ్య ఉద్దేశమని, జగిత్యాల నియోజకవర్గం లో క్రీడల క్రీడా మైదానాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజాగౌడ్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానానికి వ్యాయామం, క్రీడలు అవసరమని పేర్కొన్నారు. యువత శారీరక దృఢత్వంతో పాటు సామాజిక బాధ్యత కూడా కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి రవి కుమార్ , మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు, యువజన సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం.. ఫిట్నెస్ పై అవగాహన కల్పించేందుకు 2కే రన్

**మొదటి పేజీ తరువాయి...** సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు 2కే రన్ జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు.జెండా ఊపి 2 కే రన్ ప్రారంభించి.. అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో అరైవ్.. అలైవ్ లో భాగంగా ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కల్పించామని డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించామని పేర్కొన్నారు.చైల్డ్ సేఫ్టీ వీక్ కింద మూడేండ్ల వయసు, అలాగే ఆరేండ్లలోపు పిల్లలు తమ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు కావాలని, పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని, డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన కల్పించామని గుర్తు చేశారు.ఈ నెల 19 వ తేదీన జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో కెరీర్ & నైపుణ్యాభివృద్ధి నిర్వహించి, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, కెరీర్ మార్గదర్శకత్వంపై యువతకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన సిరిసిల్లలోని మినీ స్టేడియంలో క్రీడా దినోత్సవంలో భాగంగా కబడ్డీ, వాలీబాల్, కరాటే, షటిల్ బ్యాడ్మింటన్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 22వ జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.అదే రోజు ఉదయం వేములవాడ పరిధిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, హరిత హోటల్ సమీపంలోని పరిసరాలలో స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.అదే రోజు సాయంత్రం సిరిసిల్ల కొత్త చెరువు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ నెల 23వ తేదీన సిరిసిల్ల బైపాస్ రోడ్డులోని కె కన్వెన్షన్ హాల్లో ఉదయం 9 గంటల నుంచి ఉద్యోగ సాధన పేరుతో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో నిర్వహించే ప్రతి కార్యక్రమంలో యువత, కిశోర బాల బాలికలు అధిక సంఖ్యలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, డీవైఎస్ఓ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ ఆశ చూపి సర్పంచ్ భర్త భూ కబ్జా బాగోతం

**- మంత్రి అడ్లూరికి, జిల్లా ఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు**
**- నిబంధనలకు విరుద్ధంగా తహసీల్దార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్**
**- సేల్ డీడ్ నం. 7362/2017 రద్దు చేయాలని గంగవ్వ డిమాండ్**
**- పోలీసుల జోక్యం వద్దంటూ మంత్రి ఆదేశం..!**
**- విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్న ఎస్పీ**
**- చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్**



**చురకలు ప్రతినిధి,జగిత్యాల, మే 18 :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చిన్నాపూర్ సర్పంచ్ భర్త గట్టు గంగారాం తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని పెన్షన్ ఆశ చూపి నిరుపేద వృద్ధురాలి కొడుకుల భూమిని కబ్జా చేశాడని అతని నుండి మా భూములు కాపాడి దొంగ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలనీ సోమవారం జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ కు ప్రజావాణిలో భాధితురాలు ముస్కె గంగవ్వ పిర్యాదు చేసింది. అలాగే ఆదివారం చిన్నాపూర్ పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసిన గంగవ్వ సర్పంచ్ భర్త, పెద్ద కొడుకు రాజేశం చేసిన మోసం పై చిన్నాపూర్ గ్రామంలో ఫిర్యాదు చేసింది.

**భాధితురాలు గంగవ్వ పిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం...**

చిన్నాపూర్ లో నివాసం ఉంటున్న ముస్కె గంగవ్వ కు నలుగురు కొడుకులు. ఇంటి స్థలం 12 గుంటల భూమిని నా భర్త చెరి 3 గుంటలు రిజిస్ట్రేషన్ చేయగా ఇద్దరు రాజేశం, రాజయ్యలు ఇక్కడే ఇంటి నిర్మాణం చేసుకుని నివాసముంటున్నారు. మరో ఇద్దరు కొడుకులు లింగం, రాజలింగం రుద్రంగిలో స్థిరపడ్డారు. వారికి చెందిన 3 గుంటల చొప్పున మొత్తం 6 గుంటల ఇంటి స్థలాన్ని నా పెద్ద కుమారుడైన రాజేశంతో కుమ్మక్కయి నాకు పింఛన్ ఇప్పిస్తానని నమ్మించి బుగ్గారం తహసీల్దార్ ఆఫీసుకు తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.అయితే అట్టి భూమిని తర్వాత సర్పంచ్ భర్త గట్టు గంగారం ఇంకొకరితో కలిసి అక్రమంగా డబ్బులు ఇవ్వకుండా తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ విషయమై గంగారాం ను ఇంటికి వెళ్లి అడుగగా నన్నే భేదిరించాడని గంగవ్వ బోరున విలపిస్తూ కన్నీటి పర్యాంతమయ్యారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరగాల్సిన రిజిస్ట్రేషన్‌ను నిబంధనలకు విరుద్ధంగా తహసీల్దార్ ఆఫీసులో సెల్ డీడ్ నం. 7362/2017 ద్వారా చేయించుకున్నట్లు పేర్కొన్నారు.ఆ తర్వాత ఆ భూమిని గడ్డం మహేష్‌కు, తర్వాత మహేష్ వెన్నెలకు విక్రయించారు. వరుసగా మూడు చేతులు మారిన ఆ భూమిలో ప్రస్తుతం గంగవ్వ నివాసం ఉంటున్నారు.

**ఇల్లు నాది, పన్ను కడుతున్నా**

బాధితురాలు గంగవ్వ ఆ 6 గుంటల భూమిలోనే ఇల్లు ఉంది. ఇంటి నం. 1-46కు ప్రతి ఏటా పంచాయతీకి ఇంటిపన్ను కడుతున్నానని సూచించింది . సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ఈసీలో మా కొడుకుల పేర్లే ఉన్నాయి. అయినా మా భూమిని కాజేశారని గంగవ్వ కన్నీటి పర్యంతమయ్యారు.

**ప్రహరీ గోడతో బయటపడ్డ కబ్జా**

ఇటీవల తన స్థలానికి బౌండ్రీ కోసం ప్రహరీ గోడ నిర్మిస్తుండగా వెన్నెల అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివాదం ముదిరింది. దీంతో గంగవ్వ మంత్రి లక్ష్మణ్ కుమార్ ను ఆశ్రయించారు.బుగ్గారం తహసీల్దార్ స్వయంగా డాక్యుమెంట్లు పరిశీలించి "గంగవ్వ కొడుకులకే భూమి చెందెలా చూస్తానని చెప్పగా, మంత్రి స్పందించి ఇది సివిల్ వివాదం, పోలీసులు జోక్యం చేసుకోవద్దని చెప్పినట్లు తెలిపింది. మంత్రి ఈ విషయంపై బుగ్గారం తహసీల్దార్‌కు విచారణకు ఆదేశిశీచారు. మంత్రి హామీ మేరకు సోమవారం ప్రహరీ గోడ పనులు మొదలు పెట్టగా వెన్నెలతో పాటు ఆమే కుటుంబ సభ్యులు అడ్డుకుని నన్ను తోసివేశారాని తెలిపింది. దీంతో గంగవ్వ ప్రజావాణిలో జిల్లా ఎస్పీకి పిర్యాదు చేసింది. స్పందించిన ఎస్పీ అశోక్ కుమార్ నమ్మించి, మోసం చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ విషయమై విచారణ చేసి చీటింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకుంటానని చెప్పినట్లు గంగవ్వ తెలిపారు.

# కోటేశ్వరస్వామి ఆలయ కొబ్బరి కాయల టెండర్ ఈ నెల 28కి వాయిదా

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, మే 18 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి దేవస్థానంలో కొబ్బరికాయల విక్రయ టెండర్ కార్యక్రమాన్ని ఈనెల 28వరకు వాయిదా వేసినట్లు ఆలయఈఓ కాంతారెడ్డి తెలిపారు.సోమవారం తల పెట్టిన టెండర్‌కు అనుకున్న స్థాయిలో దరఖాస్తులు రాని కారణంగా ఈ వేలాన్ని వాయిదావేసినట్లు ప్రకటించారు. కొబ్బరికాయలు, పూజాసామాగ్రి విక్రయ టెండర్‌కు 3లక్షల డిపాజిట్,కొబ్బరి ముక్కల ప్రోగుచే సుకొనుటకు 30 వేల డిపాజిట్ చెల్లించాలని, ఈ నెల 26 నుండి 28 ఉదయం 10 గం,ల వరకు ఆలయంలో దరఖాస్తులు 2 వందలు చెల్లించి దరఖాస్తులు పొంది, దరావతు సొమ్ము,డి డి జతపరిచిన షీల్డ్ కవర్ టెండర్ బాక్స్ లో వేసి వేలంపాటలోపాల్గొనవచ్చుని, ఈ టెండర్ జూన్01,2026నుండి మే 31,2027 ఒక సంవత్సరం పాటు కాలపరిమితి ఉంటుందని ఈ ఓ, కాంతారెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ పూదరి రమేష్ తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కాంగ్రెస్ నాయకులు



**చురకలు విలేఖరి ఎండపల్లి 18 :** ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామంలోని ఐకెపి సెంటర్‌ను సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు ఎండపల్లి మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఐకెపి సెంటర్లలో వద్ద కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని తెలిపారు. ప్రతి పక్షాలు అనవసరంగా లేనిపోని రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగకుండా త్వరితగతిన వడ్లు కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో వెంటనే నగదు జమ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు తాటిపర్తి శైలందర్ రెడ్డి, ఎండపల్లి మండల పార్టీ అధ్యక్షులు గెల్లు చంద్రశేఖర్,పార్టీ ప్రధాన కార్య దర్శి కందికట్ల రాజేశం,ఫాక్స్ చైర్మన్ రాంరెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి,చర్లపల్లి గ్రామ సర్పంచ్ పడిదం లావణ్య-మొగిలి, ఉపసర్పంచ్ తిరుపతి,గ్రామశాఖ అధ్యక్షులు మహేష్, ఆలయ కమిటీ డైరెక్టర్ మెరుగు శ్రీను, పత్తిపాక శ్రీధర్,పోలోజ్ శ్రీనివాస్, మాచర్ల సంజీవ్,మాదాసు శ్రీను, సెంటర్ ఇంచార్జ్ ఆగండ్ల రవి,సోమి శెట్టి రమేష్,గాజుల విజయ్,గెల్లు శ్రీనివాస్ ,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వార్డు సభ్యులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

**-జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజాగౌడ్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 18 :** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజాగౌడ్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను




ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి 81 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తెలంగాణ టూరిజం వారి టూరిస్ట్ గైడ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

**-రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 18 :** చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి,కొనుగోలు ప్రక్రియ,కేంద్రంలో వసతి సదుపాయాలు పై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీపూర్ మొక్కజొన్న కొనుగోలు పై రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కోరిన వెంటనే కొనుగోలు కేంద్రం మంజూరు చేసి, రైతులకు ఇబ్బంది లేకుండా అవసరమైనపుడు గన్ని సంచులు మంజూరుకు కృషి చేస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌కు గ్రామ రైతులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అసత్య ప్రచారాలు రైతులు నమ్మవద్దని, గతంలో కన్నా అత్యధిక ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని, జగిత్యాల నియోజకవర్గం లో 1 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రామచందర్ రావు, ఏఎంసీ ఛైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ సత్తిరెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచులు తిరుపతి రెడ్డి, చెరుకు జాన్, గర్వందుల గంగన్న, మాజీ ఆత్మ ఛైర్మెన్ ఏలేటి రాజిరెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పురిపాటి రాజి రెడ్డి,యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బాపు రెడ్డి,ఏనుగు గంగారెడ్డి, గడ్డం గోపాల్ రెడ్డి, రైతులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పని చేస్తు కూలి మృతి

**-మెట్‌పల్లి అసుపత్రికీ తరలింపు**

**-ఎండదెబ్బ తగినట్లు కుంటుబ సభ్యుల ఆవేదన**

**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మే (18) :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేస్తూ కూలి మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామంలో చోటు చేసుకుంది. స్దానికులు,కుంటుబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంకతి మల్లవ్వ (63) సోమవారం గ్రామంలోని బోత్తరామన్న గుండ్లు ప్రాతం లో కాంటురి కందకాల పనులు జరుగుతున్నయి. పనులకు వెళ్ళీ హజర్ పుర్తి చేసుకోని అందరు పనులు



చెసెందుకు సిద్ధం అయ్యారు. ఈతరుణంలో మల్లవ్వ ఒక్కసారిగా కుప్పకూలింది. ప్రకన ఉన్న కులిలు గమనించి పిల్డు అసిస్టెంట్ అబ్బ రాజేష్ కు సమాచారం ఇవ్వగా, పంచాయతీ కార్యదర్శి గుడురు శ్రీకాంత్, సర్పంచ్ తరి రామనుజం లు మల్లవ్వ ను ప్రభుత్వ అసుపత్రి కీ తిసుకెళ్ళారు. అప్పటికే మల్లవ్వ మృతిచెందినట్లు డాక్టర్ అమరేశ్వర్ నిర్ధారించారు. ఎండ దెబ్బ తగినట్లు కుంటుబ సభ్యులు అవేదన చెందారు. సోమవారం మల్లవ్వ అత్యక్రియలు జరిగాయి. ప్రభుత్వం మల్లవ్వ కుంటుబన్ని అదుకోవలనీ గ్రామస్తులు కోరారు.

# బొమ్మ శ్రీరామ్‌కు ప్రణవ్ అభినందన



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ మే 18 :** ఇటీవల రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్గా ఎన్నికైన బొమ్మ శ్రీరామ చక్రవర్తిని స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ సోమవారం అభినందించారు. బొమ్మ శ్రీరామ్ అభినందన సభ కరీంనగర్ లో జరిగింది. దీనికి రాష్ట్ర మంత్రులతో పాటు ప్రణవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ.. బొమ్మ శ్రీరామ్ తమ కుటుంబానికి ఎంతో ఆత్మీయుడని, ఆయనతో తమకు ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కష్టపడి పనిచేసిన వారికి పదవులు ఇస్తున్నారని ప్రశంసించారు. రాబోయే కాలంలో పార్టీ కోసం కష్టపడే వారికి మరిన్ని పదవులు లభిస్తాయి అన్నారు. మున్నూరు కాపు సామాజిక వర్గ ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం బొమ్మ శ్రీరామ్ కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన బాగుందని ఎన్నికల హామీలను అమలు చేస్తోందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా.. కిశోర బాలికలకు అనీమియా పరీక్షలు



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ మే 18 :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక పాలన కార్యక్రమంలో భాగంగా సోమవారం మెప్మా కార్యాలయంలో స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ ఆర్ సుహాసిని, డిప్యూటీ డిఎంహెచ్ ఓ హుజురాబాద్ డాక్టర్ గొట్టే శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో 15 నుండి 18 సంవత్సరాల కిశోర బాలికలకు అనీమియా రక్త పరీక్షల ప్రత్యేక వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరం 23వ తేదీ వరకు జరగనుంది. హుజురాబాద్ మునిసిపల్ పరిధిలోని అన్ని వార్డులలో కిషోర్ బాలికలకు అనీమియా రక్త పరీక్షలు బిఎంఐ పర్సనల్ హైజిన్ కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించడంతోపాటు రక్తపరీక్షలు చేస్తారని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ గొట్టే శ్రవణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని హుజురాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని వార్డుల కిషోర బాలికలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆర్ సుహాసిని కోరారు. ఈ కార్యక్రమంలో చెల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్, డాక్టర్ ప్రత్యూష, విజేందర్రెడ్డి, లక్ష్మి, సత్యం తదితరులు పాల్గొన్నారు.



## ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు 25 ఎకరాల స్థలాన్ని కేటాయించాలి

**-కేంద్రీయ విద్యాలయానికి 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలి**

**-సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 18 :** యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు 25 ఎకరాల స్థలాన్ని, కేంద్రీయ విద్యాలయానికి 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరుతూ సోమవారం మాజీ మంత్రి జీవన్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. జగిత్యాల జిల్లాకు మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి చల్గల్ వాలంతరీకి చెందిన స్థలంలో 2 ఎకరాలు, ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు 10 ఎకరాల స్థలాన్ని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని, ప్రభుత్వం కేటాయించిన స్థలంలో పాఠశాలలకు సంబంధించిన భవన నిర్మాణాలు, క్రీడా మైదానాలు, ల్యాబ్ ఏర్పాటుకు సరిపోవని, ప్రభుత్వం స్పందించి ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు 25 ఎకరాల స్థలాన్ని, కేంద్రీయ వి ద్యాలయానికి 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



**చురకలు విలేకరి, జగిత్యాల, మే 18 :** జగిత్యాల పట్టణ మేరు సేవా సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 2026-2029 మూడేళ్ల కాలపరిమితికి జరిగిన ఈ ఎన్నికల్లో నూతన కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణ అధ్యక్షులుగా రాపర్తి వినోద్, ఉపాధ్యక్షులుగా రాగిల్ల నారాయణ, ప్రధాన కార్యదర్శిగా గట్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా రాయిల్ల శ్రీధర్, కోశాధికారిగా గట్ల శ్రీకర్ ఎన్నికైనట్లు ఎన్నికల కన్వీనర్ కర్నె గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు రాపర్తి వినోద్ మాట్లాడుతూ సంఘ సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తామని, దర్జీ వృత్తి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం సభ్యులు నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

## తహసీల్దార్, ఎస్ఐలకు వినతి



**చురకలు విలేకరి, బీర్పూర్, మే 18 :** బీర్పూర్ మండల మెడికల్ షాపుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆన్లైన్ మందుల విక్రయాలను నిలిపి వేయాలని కోరుతూ ఆల్ ఇండియా సిఅండ్ అసోసియేషన్ పిలుపు మేరకు ఈనెల 20న మెడికల్ షాపుల బందుకు పిలుపునిచ్చారు. సోమవారం అసోసియేషన్ నాయకులు తహసీల్దార్, ఎస్ఐలను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆన్లైన్ మందుల విక్రయంతో మెడికల్ షాపుల్లో విక్రయాలు తగ్గిపోయాయని, ఆన్లైన్ మందుల విక్రయాలను నిలిపి వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెట్ల శేఖర్, శనిగారపు రాజేష్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

## విలేకరి ప్రెస్ క్లబ్ సభ్యత్వం తొలగింపు

**చురకలు విలేకరి, బీర్పూర్, మే 18 :** బీర్ పూర్ మండలంలోని తుంగూరు గ్రామానికి చెందిన ఆడెపు వెంకటేష్ అనే వ్యక్తి ఓ దినపత్రికలో విలేకరిగా పని చేస్తూ మండలంలోని పలు శాఖల అధికారులను బెదిరింపులకు గురి చేస్తూ డబ్బులను వసూలు చేస్తున్నాడనే ఆరోపణలతో అతని బీర్పూర్ మండల ప్రెస్ క్లబ్ సభ్యత్వాన్ని తొలగిస్తున్నట్లు బీర్పూర్ మండల ప్రెస్ క్లబ్ కార్యవర్గసభ్యులు తెలిపారు. వెంకటేష్ పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు, వెంకటేష్ కు బీర్పూర్ మండల ప్రెస్ క్లబ్ ఏలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**-రైస్ మిల్లుల వద్ద ధాన్యం 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలి**

**-జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్. లత**



**చురకలు విలేకరి, కోరుట్ల, మే 18 :** ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, రైస్ మిల్లుల వద్ద ధాన్యం 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్. లత అన్నారు.సోమవారం కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం,రాజ రాజేశ్వర రైస్ మిల్లు,కథలాపూర్ మండలం దూలూరు,బొమ్మెన,తాండ్రి యాల వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ను ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షం గా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలో అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అలాగే ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించే లా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం,నాణ్యత ప్రమాణాలను ఖచ్చితం గా పరిశీలించాలని,రైతుల ప్రయోజనాల ను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు.అనంతరం రైస్ మిల్లులను తనిఖీ చేసి మిల్లర్లు హమాలీల సంఖ్య పెంచాలని ధాన్యం తో వచ్చిన లారీలను 24 గంటల్లోగా అన్లోడ్ అయ్యే విధంగా చూడాలని రైస్ మిల్లర్లు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోళ్లు సజావుగా,వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ధాన్యం అన్లోడింగ్ లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్,డీటీలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కేంద్రల నిర్వాహకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# చెరువు కాలువల ఆక్రమణ తొలగింపుకు చర్యలు తీసుకోవాలి

**-బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 18 :** చెరువుల ఆక్రమణ తొలగింపుకు చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి.జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్-రఘురాములకోట గ్రామంలో కాలువల భూముల కబ్జాను నిరసిస్తూ మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్, బిఆర్ఎస్ శ్రేణులు, స్థానిక రైతులతో కలసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం చెరువుల భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నప్పటికీ అవి కాగితాలకు పరిమితమవుతాయన్నారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ మిషన్ కాకతీయ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో చెరువులు, కుంటలు, వాగుల పూడిక తీసి పునరద్ధరించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెరువులు, కుంటలకు హద్దులు నిర్ణయిస్తున్నామని చెబుతున్నప్పటికీ జగిత్యాల జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ముప్పారపు చెరువుకు నీళ్లు వెళ్లే కాలువలను మట్టితో పూడ్చి వేయడం, కాలువల భూములు కబ్జాకు గురవుతున్నా ప్రభుత్వం, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి జిల్లాలో కబ్జాకు గురవుతున్నా చెరువులు, కుంటలు, వాగులు, కాలువల భూముల పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

### రైతులకు ఇబ్బందులు లేకుండా

# ధాన్యం కొనుగోళ్లు



**-జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్**

**చురకలు విలేకరి, బీర్పూర్, మే 18 :** రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతుందని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ పేర్కొన్నారు. బీర్పూర్ మండలంలోని పలు గ్రామాల్లో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్ల ను సజావుగా జరపాలని,ఆకాల వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకుంటూ, తూకం అయిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.ఈ కార్యక్రమం లో కెడిసిసి జిల్లా సభ్యులు ముప్పాల రాంచందర్రావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అర్షకోట రాజగోపాల్ రావు, సర్పంచులు హరీష్, తోట శ్రీనివాస్, రాజ్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ నవీన్ రావు, ఆలయ చైర్మన్ చీర్నేని శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

# రాజమొగిలి కళ్ళు సజీవం..!

**-మరణించినా అందుల జీవితాల్లో వెలుగులు**



**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, మే 18 :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం బాబు క్యాంప్ బస్తీకి చెందిన మొగిలి పాన్ షాప్ నిర్వాహకులు జక్కోజు రాజమొగిలి మరణించినా అతని కళ్ళు మాత్రం సజీవంగానే మారాయి.ఆదివారం రాత్రి అనారోగ్యం తో రాజ మొగిలి మరణించారు.పుట్టెడు దుఃఖంలో ఉన్న అతని కళ్ళను నేత్ర దానం ద్వారా ఇద్దరు జీవితాల్లో వెలుగులు నింపేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. దీంతో వాసన్ ఐ బ్యాంక్ సిబ్బంది చందు సోమవారం నేత్రదానంలో భాగంగా మృతుని కార్నియా సేకరించారు. జనహిత సేవాసమితి అధ్యక్షులు ఆడెపు సతీష్ మాట్లాడుతూ మృతుడు జక్కోజు రాజ మొగిలి మృతి బాధాకరమన్నారు. మృతుని భార్య రమాదేవి, కుమార్తెలు ప్రియాంక,ప్రతిభ,ప్రవళిక,సోదరుడు రవి నిద్ర దానం ద్వారా ఇద్దరి అందులకు చూపు ను ఎందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ప్రజలు అపోహాలు వీడి నేత్ర, అవయవ, శరీర దానానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. నేత్రదానం అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు వాసన్ ఐ బ్యాంక్ సిబ్బంది నేత్రదాన సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో జన హిత సేవాసమితి ఉపాధ్యక్షులు కందుల రాజన్న,హనుమాండ్ల రమాదేవి, కార్య వర్గ సభ్యులు జంబోజు చంద్రశేఖర్, పన్నాల సదానందం, భీమిని కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్య పెంచాలి

**-రైస్ మిల్లులు, గోదాముల్లో అన్ లోడింగ్ వేగంగా చేయాలి**

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**-ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్**



**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, మే 18 :** కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం, వాహనాల ద్వారా ధాన్యం తరలింపు, హమాలీల సంఖ్య పెంపు, అన్ లోడింగ్ చేయడం, రైతులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై సోమవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పౌర సరఫరాల, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా, మెప్మా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రతి రోజు ఉదయం 08.00 గంటలకు జిల్లా కలెక్టర్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్నారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో డిమాండ్ కు అనుగుణంగా వాహనాలు సమకూర్చాలని సూచించారు. రైస్ మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల కొరత లేకుండా చూడాలని, డిమాండ్ కు అనుగుణంగా పెంచి, ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. హమాలీలకు భోజనం, వైద్య సేవలు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద కేటాయించిన రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని, క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# పాఠశాల ప్రహరీ గోడకు భూమి పూజ

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మే 18 :** మంథని మండలం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని వేంపాడు గ్రామంలో గల పాఠశాలకు ప్రధాని గోడకు భూమి పూజ నిర్వహించారు. మండలం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని వేంపాడు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఉన్నంత పాఠశాల కు డి ఎం ఎఫ్ టి నుండి మంజూరైన 30లక్షల రూపాయల నిధులు మంజూ రు అయ్యాయి మంజూరైన నిధులను ప్రహరీ గోడకు భూమిపూజ చేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్. అనంతరం గ్రామసర్పంచ్ మాట్లాడుతూ నిధులు మంజూరు చేసిన ఐటి శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐలి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో అభివృద్ధి చేసి చూపిస్తున్న ఐటీశాఖ మంత్రివర్యులు శ్రీధర్ బాబు కి గ్రామం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న



కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ముస్కుల సురేందర్ రెడ్డి ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంతని సత్యం వార్డు సభ్యులు తోట శ్రవణ్ కాంగ్రెస్ నాయకులు కావటి సమ్మయ్య కవటి సందీప్ అక్క పెల్లి నగరంపల్లి సర్పంచులు వేంపాడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ధాన్యమును వేగవంతంగా మిల్లులకు తరలించాలి

**-ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



**చురకలు ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి, మే 18 :** ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. భూపాలపల్లి మండలం లోని ఎస్.ఎం. కొత్తపల్లి గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చే వరి ధాన్యాన్ని తేమశాతం (మాయిశ్చర్) వచ్చిన వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని వరిధాన్యం కొను గోలు కేంద్ర ఇన్‌చార్జ్‌కు సూచించారు. రైతులకు ఎలాంటి కోతలు లేకుండా అధికారులు పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని ఆదేశించారు. వానా కాలం ప్రారంభమయ్యే పరిస్థితులు ఉన్న నేపథ్యంలో రైతులకు అవసరమైన పరదాలను ప్యాక్స్ ద్వారా అందుబాటు లోఉంచాలని ఎమ్మెల్యే తెలిపారు. రైతు లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి, భూపాలపల్లి ప్యాక్స్ చైర్మన్, సీఈఓ, ముఖ్య నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# కవిత సమక్షంలో టిఆర్ఎస్ పార్టీ చేరిన మజీద్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట మే 18 :** దాదాపు మూడు దశాబ్దాలుగా కలం పట్టి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండి నిజాలను పత్రికలలో ప్రచురితమయ్యే కథనాలను రాశాడు.. మరింత ప్రజలకు సేవ చేయాలనే ఆతృతతో కలం వీడి టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో కండువా కప్పుకున్న జర్నలిస్ట్ మజీద్.. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఆదర్శ జిరాక్స్ సెంటర్ వ్యవస్థాపకులు, ఓ దినపత్రిక రిపోర్టర్ మజీద్ ఇవాళ హైదరాబాదు లోని టీఆర్ఎస్ పార్టీ ఆఫీసులో కరీంనగర్ ఉమ్మడి టిఆర్ఎస్ నాయకుల సమక్షంలో పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత స్వాగతం పలికి కండువాను కప్పింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పాత్రికేయ వృత్తిలో కొనసాగి ఇవాళ ప్రత్యక్ష రాజకీయాల్లో చేరడం జరిగిందని అన్నారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల కోసం పార్టీ కోసం పనిచేయడం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా ప్రత్యక్షంగా పరోక్షంగా ఇంతకాలం తనకు సహకరించిన జర్నలిస్టులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ



**చురకలు విలేఖరి వీణవంక మే 18 :** వీణవంక మండల పరిధిలోని రామకృష్ణాపూర్ గ్రామంలో సోమవారం ఉపాధి హామీ కూలీలకు వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ దూడపాక శ్రీవేణి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండ తీవ్రతలో కష్టపడి గ్రామాభివృద్ధి పనులు చేస్తున్న కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం తమకు అత్యంత ముఖ్యమని తెలిపారు. కార్మికులు ఎలాంటి అసౌకర్యం లేకుండాపనులు కొనసాగించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తదితరులు ఉన్నారు.

## జిల్లా విద్యాశాఖ అధికారినీ సన్మానించిన జిల్లా బీసీ సంక్షేమ సంఘం సభ్యులు



**చురకలు ప్రతినిధి,నిర్మల్,మే, 18 :** ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నిర్మల్ జిల్లా మూడో స్థానం రావడం చాలా సంతోషమని నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్నను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో విద్య పతిష్ఠానికి భోజన్న ఎన్నో చర్యలు తీసుకుంటున్నారని విద్యాభివృద్ధికి క్షణం తీరక లేకుండా పనిచేసే గొప్ప వ్యక్తి భోజన్న అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా కో-కన్వీనర్లు. కత్రోజు అశోక్ చారి, సిరికొండ రమేష్, జింక లక్ష్మీనారాయణ. కార్యనిర్వాహక అధ్యక్షుడు మరకంటి జీవన్, అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మే 01నుండి 31వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ 1861 అమలు

**-పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు,రాస్తా రోకోలు, నిరసనలు,ర్యాలిలు నిర్వహించారాదు**

**-డి.ఎస్.పి నాగేంద్ర చారి**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 18 :** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని మే 01 నుండి 31వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉన్నదని, దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు నిర్వహించారాదన్నారు. ఈరోజు సిరిసిల్ల పట్టణ కేంద్రంలో పోలీస్ వారి అనుమతులు లేకుండా ధర్నా చేసి పట్టణ కేంద్రంలో శాంతి భద్రతలకు, ప్రజా రవాణాకు విఘాతం కలిగించిన ఇరు వర్గాలపై సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో కేసులు(క్రైం నంబర్ లు 270/2026,271/2026) నమోదు చేయడం జరిగిందని సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు, అసత్య సమాచారాన్ని ప్రచారం చేసి జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత గ్రూప్ అడ్మిన్‌లను కూడా బాధ్యులుగా పరిగణిస్తామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని ఈసందర్భంగా సూచించారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**-గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 37 ఫిర్యాదులు స్వీకరణ**
**-జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 18 :** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 37 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమై నంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# ఉత్సాహంగా సాగిన పరుగు పందెం..ఆకట్టుకున్న యోగా ప్రదర్శనలు



**చురకలు ప్రతినిధి,నిర్మల్, మే, 18 :** ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవనం కోసం యోగా,వ్యాయామాలను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా సూచించారు. "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" యువజన, క్రీడా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం నిర్వహించిన "ఆరోగ్యం మరియు చురుకుదనం" తెలంగాణ, పరుగు మరియు శారీరక అక్షరాస్యత" కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని శివాజీ చౌక్ నుంచి ప్రారంభమైన మారథాన్ ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. యువత,విద్యార్థులు,ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,యోగా,శారీరక వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. నిరంతర శారీరక శ్రమ వల్ల అనేక దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసుకోవచ్చని, భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు. యోగాల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, సిపిఓ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్ భవేశ్ మిశ్రా



**చురకలు ప్రతినిధి,నిర్మల్, మే, 18 :** బక్రీద్ పండుగను జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో,భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బక్రీద్ పండుగ ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈద్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రార్థనా స్థలాల్లో తాగునీటి సౌకర్యం తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. పండుగ నేపథ్యంలో పురపాలక,గ్రామపంచాయతీ అధికారులు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈద్గాల పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం కల్పించాలని సూచించారు. అలాగే ప్రార్థనల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ప్రజలు అన్ని పండుగలను పరస్పర సహకారం,సామరస్యంతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున తగిన బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అడిషనల్ ఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, నిర్మల్, భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్లు అప్పాల గణేష్ చక్రవర్తి, బిబి కుతిజ సిద్ధికి, వివిధ శాఖల అధికారులు, హిందు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# చెరువు పూడిక పనుల ప్రారంభం



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, మే18 :**
జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్థంభంపల్లి పెద్ద చెరువు వద్ద ఉపాధి హామీ పథకం లో భాగంగా చెరువు పూడికపనులను సోమవారం గ్రామ సర్పంచ్ రాజయ్య, ఉపసర్పంచ్ గంగయ్య లు ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ జాతరకు ఆహ్వానం



**చురకలు విలేఖరి వీణవంక మే 18 :** వీణవంక మండల పరిధిలోని ఎల్బాక గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరకు వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి నీ జమ్మికుంట మార్కెట్ డైరెక్టర్లు నల్లగొని సతీష్ గౌడ్, మాదాసి సునీల్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించి ఆహ్వాన పత్రిక అందజేశారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను పరామర్శించిన "పొన్నం"



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట మే 18 :** రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ తల్లి నాగుల రామలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకొని సోమవారం సిరిసిల్లలోని వారి నివాసానికి వచ్చి ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించి నాగుల సత్యనారాయణ గౌడ్‌ను మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం నరసయ్య బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూర దేవరాజ్ పరామర్శించారు.

## బాలపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ మే 18 :** కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ మండలం, బాలపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి పైగా రోగులకు నిపుణులైన వైద్యులు సేవలందించారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డి ఎకో వంటి కీలక పరీక్షలు నిర్వహించి తక్షణ నిర్ధారణ చేశారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. పండుగలు, సెలవులు అనే తేడా లేకుండా 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. అవసరమైతే రోగులను కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రికి తరలించి ఆధునిక వైద్యం అందిస్తామని తెలిపారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించిన మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిభిరంలో మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, అబ్దుల్ వకీల్, రఘు, గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి



**చురకలు ప్రతినిధి,కమాన్‌పూర్ మే 18 :** ఇటీవలే తాటి చెట్టు పై నుండి పడి గాయాలపాయలైన మల్యాల రాయ మల్లు కు ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించాలని గ్రామ సర్పంచ్ పూనగంటి కుమార్ మరియు గౌడ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.నాగారం గ్రామ పంచాయతీ లోని లింగాల గ్రామానికి చెందిన మల్యాల రాయమల్లు గౌడ్ అనే గీత కార్మికుడు శనివారం తాటిచెట్టు ఎక్కి కళ్ళు గీస్తుండగా తన కత్తి అదుపు తప్పి చెయ్యిపై పడటంతో కత్తి తన చెయ్యి కి లోతుగా దిగడం తో తాటి చెట్టు పైనుండి కిందకు పడటం జరిగింది.అందుబాటులో ఉన్న తోటి కుమార్ గౌడ్,కమ్మగోని భాస్కర్ లు స్పందించి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి లో చేర్చడం జరిగింది. అనంతరం ఇంటికి చేరుకున్న రాయమల్లును పలువురు గీత కార్మికులు సోమవారం సర్పంచ్ కుమార్ పరామర్శించి ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 18 :** ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన తాళ్ళపెల్లి సౌమ్య (27500)వేల రూపాయలు కంబాల రోహిత్ రెడ్డికి 16500 రూపాయల సిఎంఆర్ ఎఫ్ చెక్కులను,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు.నిరుపేదల కుటుంబాల వైద్యానికి ముఖ్య మంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోనాల మణెమ్మ,నాయకులు గాజుల రజిని,డైరెక్టర్ గొల్లపల్లి లక్ష్మారెడ్డి కాంగ్రెస్ నాయకులు మూర్తి వెంకట్ రెడ్డి గండికోట రవి,కంచర్ల శ్రీను అల్వాల కర్ణ ,ఎదునూరి బాలరాజు, ఉప్పుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన బస్టాండ్ పరిశీలన



**చురకలు ప్రతినిధి,కమాన్‌పూర్ ( రామగిరి) మే 18 :** రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో ఆర్ అండ్ బి రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామ బస్టాండ్ తొలగించబడటంతో గ్రామ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా ఎండాకాలం మరియు రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, సోమవారం కల్వచర్ల గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి బస్టాండ్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన కొత్త బస్టాండ్ ఏర్పాటుపై చర్చించడంతో పాటు, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సామూహిక టాయిలెట్స్ నిర్మాణానికి అనువైన స్థలాలను కూడా పరిశీలించడం జరిగింది.అలాగే సంబంధిత గౌరవ మంత్రి గారి దృష్టికి మరియు జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి, గ్రామ ప్రజలకు శాశ్వత పరిష్కారం లభించేలా సత్వర చర్యలు తీసుకునే దిశగా కృషి చేస్తానని సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బండ సంపత్, స్థానికులు పింగిలీ శ్రావణ్ కుమార్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# "బండి" బండారం బయటపడింది

**-హుజురాబాద్లో బండి రాజీనామా చేయాలంటూ.. కదం తొక్కిన బిఆర్ఎస్**

**-గంటకు పైగా ధర్నా రాస్తారోకో**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ మే 18 :** మైనర్ బాలికను వేధించిన కేసులో ప్రధాన నిందితుడైన బండి సాయి భగీరథ్‌కు ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన అతని తండ్రి కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బిఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నేతలు స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద పెద్ద ఎత్తున ఆందోళన ధర్నా రాస్తారోకో నిర్వహించారు.బండి సంజయ్ రాజీనామా చేయాలంటూ ప్ల కార్డులు ప్రదర్శించారు.బండికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. బండి సంజయ్ రాజకీయాల్లో లబ్ధి కోసం కులమతాలను వాడుకుంటూ వర్గాల మధ్య చిచ్చులు పెడుతున్నారని మండిపడ్డారు. పోక్సో కేసుతో బండి బండారం బయటపడిందని, తన కుమారుని కేసు నుండి తప్పించేందుకు ఆయన ఎన్నో ప్రయత్నాలు చేశారని విమర్శించారు. కేసు నమోదైన వెంటనే తన కుమారుని ఎందుకు పోలీసులకు అప్పగించలేదని ప్రశ్నించారు. బాధిత కుటుంబాన్ని బెదిరించి ఎందుకు ప్రయత్నించారని, ఇప్పటికీ నా కుటుంబానికి బండి నుంచి ప్రమాదం ఉందని స్పష్టం చేశారు.బాధిత కుటుంబానికి ఏం జరిగినా ప్రభుత్వంతో పాటు బండి సంజయ్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.కేంద్ర హోం మంత్రిగా ఉన్న బండి సంజయ్ ఇంట్లో పోలీసులు సోదాలను నిర్వహించడం సిగ్గుచేటని,గల్లీలో రాజకీయం చేయడం తప్ప బండికి తెలిసింది ఏమీ లేదని విమర్శించారు. ప్రజాస్వామ్యం పై ఏమాత్రం గౌరవం ఉన్నా బండి సంజయ్ వెంటనే తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.రాష్ట్రంలో బిజెపి కాంగ్రెస్ ఒక్కటయ్యాయని, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి బండిని కాపాడ దామని చూశారని వారి తెర వెనుక స్నేహం ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు.భగీరథ కేసుకు రెండు రోజుల ముందే కరీంనగర్లో బండి సంజయ్ అనుచరులు రౌడీల్లా వ్యవహరించి గంగుల కమలాకర్ కార్యాలయంలో ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై ఆయన వాహనాలపై దాడి చేశారని, దీని వెనుక బండి సంజయ్ హస్తం ఉందని బండిని కూడా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.బండి సంజయ్ రాజీనామా చేయకుంటే కేంద్రమే పదవి నుండి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు బండ శ్రీనివాస్,ఎడవెల్లి కొండల్ రెడ్డి, ఇరు మళ్ళ సురేందర్ రెడ్డి,గందె శ్రీనివాస్, కేశిరెడ్డి లావణ్య,కొయ్యడ కమలాకర్, అజమతుల్లా ఖాన్, విడపు అనురాగ్, సర్పంచ్ కట్కూరి మల్లారెడ్డి, కొయ్యడ శ్రీదేవి, కొండ్ర నరేష్, ఆర్కే రమేష్, కుమారస్వామి, ల్యాబ్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# పంట అధిక దిగుబడికి సేంద్రియ ఎరువు

**- రసాయన ఎరువుల తగ్గించుకుంటే మేలు**

**- నల్లమట్టి,కోళ్ళ,పశువుల ఎరువుకు పెరిగిన డిమాండ్**

**- పంట దిగుబడీకోసం అసక్తి చుపుతున్న రైతులు**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మే (18) :** వ్యవసాయ క్షేత్రలలో నల్ల మట్టినివేసుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. భూసారం పెరగడానికి నల్ల మట్టి ఎంతో దోహదపడుతుంది. రసాయనిక ఎరువుల వాడకంతో భూమి సహజ గుణాన్ని కోల్పోతోంది. మోతాదు కు మించి రసాయనిక ఎరువులు వాడుతుండటంతో భూములు నిస్సారం అవుతున్నాయి. భూసారం పెరగ డానికి రసాయనిక ఎరువులు వాడే బదులు మట్టి,పశువుల పెడ,కోళ్ళ పెడ,గొర్ల, మేకల పెడని వాడితేమంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.రసాయనిక ఎరువులతో పంట నాణ్యత లోపించడమే కాకుండా పెట్టుబడి కూడా పెరుగుంది.పంటల సాగులో మెళకువలు పాటిస్తే పెట్టుబడి తగ్గడమే కాకుండా పంట దిగుబడి పెంచుకోవచ్చు ఇందులో భాగంగా ఎక్కువగా మట్టిని వాడితే ఆశించిన మేర రాబడి సాధించవచ్చునని వ్యవసాయ అదికారులు రైతులకు సుచిస్తున్నారు.ఈ మధ్య కాలంలో నల్ల మట్టి ని యంత్రలతో తవ్వించుకోనీ రైతులు తమ వ్యవసాయ భుములలో పోసుకోవటం కోసం ఆసక్తి చూపిస్తున్నారు.పలు చోట్ల రైతులు చెరులోని మట్టినీ సైతం తోటలలో వేయిస్తున్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదుర్, తిమ్మపుర్, తిమ్మపుర్ తండ,యామపుర్, ఫకిర్ కోండాపుర్,వేములకుర్తి, బర్దిపుర్, ములరాంపుర్, ఎర్దండి,కోమటీకోండపుర్ , వర్షకోండ, కోజన్ కోత్తుర్, కేశాపుర్, ఇబ్రహీంపట్నం, డబ్బ,అమ్మకపెట్, ఎర్రపుర్ గ్రామలలో రైతులు పసుపు, మెక్కజోన్న తదితర పంటలు వేసె భుములలో నల్లమట్టి, కోళ్ళ,గోర్ల,మేకల, బర్ల పెడను కోనుగోలు చేసి పంటల అదిక దిగుబడి కోసం వేలల్లో ఖర్చు చేసి వేస్తున్నారు.

**పశువుల ఎరువు,మట్టితో భూసారం పెంపు....**

మట్టిని వ్యవసాయ భుములలో వేసుకుని కలియ దున్నితే భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంది.చెరువు మట్టిలో నత్రజని,పొటాష్,భాస్వరం,జింకు, బోరాన్,సేంద్రీయ కర్బనం, సూక్ష్మ పోషకాలు పెరిగి అధిక దిగుబడి వస్తుంది.సేంద్రీయ కర్బనం ఎక్కువగా ఉంటే మినరలైజేషన్ ఎక్కువగా జరిగి మొక్కల పెరుగుదలపై ప్రభావం చూపుతుంది.తేమను నింపుకునే శక్తిని పెంచుతుంది.నీటి వినియోగసామర్థ్యం కూడా పెరుగుతుంది.10 నుండి 15 శాతం ఎరువుల వినియోగం తగ్గుతుంది. పొలాల్లో ఎకరానికి 20 నుండి 25 ట్రాక్టర్ల మట్టిని పంట భుమిలో కలిపీ దుక్కిలో కలియ దున్నితే మంచి పంట చేతికి వస్తుంది.

**పంటకు ప్రయోజనాలు ఎన్నో...**

మట్టిని ఒక సారి వాడితే రెండు ముడు పంటల వరకు పంట పొలానికి పోషకాలు అందుతాయి.మట్టిని పొలాల్లో వేసుకోవడం వలన పొలాన్ని ఆమ్ల, క్షార గుణాలతో తటస్థంగా మార్చుకోవచ్చు. నేలో లవణాల గాఢతతగ్గుతుంది.సూక్ష్మ, స్థూల పోషకాల స్థాయిలు పెరుగుతాయి .ముఖ్యంగా చెరువు మట్టిలో ఆల్గే వలన నత్రజని స్థాయి పెరిగి దిగుబడి పెరుగుతుంది. నేల గుల్లబారి నీటి పారుదల మెరుగవుతుంది.ఈ మట్టిలో సూక్ష్మ జీవులు ఎక్కువగా ఉండడం వలన నేలలో గాలి పరిమాణాన్ని,పోషకాలను పెంచుతాయి. ఎరువుల వాడకం చాలా వరకు తగ్గుతుంది.కిలోమట్టిలో ఉండే పోషకాలు నత్రజని720 మిల్లీగ్రాములు, పొటాష్ 310 మిల్లీ గ్రాములు,భాస్వరం 35మిల్లీ గ్రాములు ,గంధకం 18 మిల్లీ గ్రాములు, జింకు 2.8 మిల్లీ గ్రాములు, బోరాన్ 0.8మిల్లీ గ్రాములు,కర్బనం 0.5మిల్లీ గ్రాములు, మేలు చేసే సూక్ష్మ జీవులుసాంధ్రత 308గ్రాములు వరకు ఉంటుంది.

**నల్లమట్టి,కోళ్ళ,పశువుల ఎరువుకు పెరిగిన గిరాకీ....**

నల్లమట్టి,కోళ్ల పెడ,పశువుల ఎరువుకు మంచి గిరాకీ ఉంది ట్రాక్టర్ నల్లమట్టి కీ వేయ్యి పైన,కోళ్ళ ,పశువుల పెడకు దాదాపు 6 వేల వరకు ట్రాక్టర్ ట్రిపుకు ధర పలుకుతోంది.పలు గ్రామలలో గొర్రెల, మేకల,అవుల మందలను రోజుల వారిగా ఎరువు కోసం తమవ్యవసాయ భుములలో రోజుకు రుపాయలు 5వేలవరకు ఇచ్చి రాత్రి భుమిలో ఉంచుకోని ఎరువు చేసుకుంటు అదిక దిగుబడి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

**సెంద్రియ ఎరువుతో అధిక దిగుబడి**

**అకు రాజ్ కుమార్ వ్యవసాయ అదికారి ఇబ్రహింపట్నం**

నల్ల మట్టి,పశువుల పెడ ను పంట క్షేత్రాలలో వాడడం వలన పెట్టుబడి తగ్గి అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంది. కూరగాయల సాగుకు రైతులు ఎక్కువగా రసాయనిక ఎరువులు వాడుతున్నారు. ప్రతి పంటకి మోతాదుకి మించి రసాయన ఎరువులు వాడుతన్నం కాబట్టి పెట్టుబదులు పెరుగుతున్నాయి కానీ పంటకి కావాల్సిన ముఖ్య పోషకాలు పంట తీసుకోలేకపోతుంది. ప్రతి వానాకాలం పంటకి ముందు సెన్ద్రియ ఎరువులు వాడినట్లితే నెలలో సహజంగా పోషకాలు లభ్యత పెరిగి భూ సారం పెంపుందించుకోవచ్చు.

